# దా సీ పి ల్ల

‘డబ్బు దండిగావుంటే వారు బాగా తినొచ్చు, రోజూ నాలుగుసార్లు సినిమాలు చూడొచ్చు, విలువయిన వలువలు ధరించవచ్చు, మరి చిత్త మొచ్చినట్టు విహారించవచ్చు. ఎవరొద్దంటారు !—కాని, లోకువయినంతమాత్రాన నిర్ధనులైన నిరపరాధుల అసువులను బలిగొనటం యేమంత భావ్యమైనపనీ?— అయితే పేదలతో ప్రభువులు చెలగాటా లాడ్డానికి సంఘం దోహదం చేస్తుంది. ఇంతకీ, వారు ఐశ్వర్యమంతులూ—’

రచయిత :

‘ బాబుజీ ’

మావాడుకదా అనిచెప్పి యా ధార్ష్ట్యం మరుగుపరచటానికి నాకు మనస్కరించకుండా వుంది. ఆ విషయం నా కిప్పటికీ గుండెల్లో మెదుల్తూనే వుంటుంది.

‘లా’ చదువుకోసం మావాడు కుటుంబసహితంగా తిరువాన్కూరు వెళ్లాడు, ఆ సంవత్సరం.

మలయాళీ దేశంలో మహా చక్కటి పిల్లలుంటారని అంతకు ముందు వింటూవచ్చాడు మావాడు. ఈ చదువు అక్కడ సాగించటంలో మలయాళీ పిల్లల్నికూడా ఒకచూపు చూడవచ్చుననేది అతగాని మనస్సులోని వుద్దేశాల్లోఒకటైతే ఐవుండొచ్చు.

కాపరం అంటూ పెట్టాక పని మనిషి ఉండక తప్పదుకద! మావాళ్ళ అదృష్టంకొద్దీ ఒక నీటయిన నిండు పదహారేళ్ళ జవ్వని కొలువుకి కుదురుకుంది. ఆ పిల్ల రూపవతి మాత్రమే కాదు. ఆమె నాల్గవ ఫారంవరకూ చదువుకున్న విద్యావతి. పేరు ‘జలజ’.

వృత్తి యేదయినా నిజాయితీ ప్రధానమైన జాతి అది. అంతే కాని చేసే పనికి నైచ్యతను ఆపాదించే గుణం లేదు వాళ్ళకి, అంచేతనే, ఒకరింట్లో పనిమనిషిగా కుదరటానికి అంత చదువుండికూడా ఆ వయసులో సందేహించనే లేదు జలజ.

ప్రవేశించింది మొదలుకుని, ఆ యింటిలో ఒక తెగా మెలగుతూ, మావాళ్ళకి ఆడపిల్ల ల్లేని లోపం తీర్చింది.

జలజ తల్లి శతవృద్ధు. ఆమె చెన్నాపట్టంలో ఒక రింటదాది.

* * *

చెప్పొద్దూ!—

మావాళ్లు మంచి ఐశ్వర్యవంతులు.

గొప్పవాళ్లు.

శ్రీమంతులు.

సామంతులు.

పెద్దయింటివాళ్లు.

వాళ్ళ ఐశ్వర్య మదానికి విరుగుడు అగుపడదు. వాళ్ళ నిరంకుశతను ‘నిమ్మకు నీరోసినట్లు’ సాగనిస్తుంది నీతిమాలిన సంఘం.

వాళ్లు మత్తెక్కి చేసే వికారపు చేష్టలన్నిటికీ జేజేలు కొడుతుంది కాసుకి ఆశపడే పాడులోకం.

‘కో’ అంటే కోటిమంది బలగం. వాళ్ళ పలుకుబడి మేర లేనిది. వాళ్ళేమన్నా చెల్లిపోతుంది, ఏం చేసినా పరిసిబారిపోతుంది. వాళ్ళ కత్తికి అడ్డులేదు. వాళ్ళమాటకి తిరుగులేదు. ఇంతకీ, వాళ్లు ఐశ్వర్యవంతులూ...

* * *

అమ్మగారి మొహం అస్తమానం ధుమధుమలాడుతూనే వుంటుంది. అందులోనూ మెత్తని వాళ్ళని చూస్తే ఆగడికి మరీ కిమ్మ పొద్దుట్నుంచీ ఆమె పనిపెట్టి ఏవో వెతుక్కుంటూంది.

అతి వినయంతో వచ్చి ఎదట నిలబడింది జలజ.

అమ్మగారు :—ఏం ? ఎందుకూ ?

"మా అమ్మకి సుస్తీగా వుంది, రమ్మని వుత్తర మొచ్చిందండి. రేపటిరోజున ప్రయాణమండి. జీతం దయచేస్తిరంటే..."

"జీ – తం...! యివ్వాక పారిపోతారు కాబోలు..."

"అది కాదండమ్మా..."

"చళ్ – భడవా!... రేపిస్తాం, ఫో—"

మోహం దించుకుని వెళ్ళిపోబోతూంది జలజ. అయినా మళ్ళీ ఒక్కసారి అడిగేసి పోదామా అన్నట్టుగా గుమ్మందగ్గిరే కాశ్శేపు నిలబడింది. చూసి చూసి వెళ్ళిపోయింది.

ఇంతలో, ఆ తెగ వెతుక్కుంటున్న అమ్మగారు గదంతా తలకిందు చేసి, కలియవెదికి, వస్తువాహనా లుండే పెట్టెవంక ఇట్టె చూసి—

"యేమయిందీ!" అంటూ రంకె వేసింది.

మళ్ళీ బహుశా జలజను వెనక్కు పిలుద్దామా అని కాబోలు, అటు యిటు చూసింది. కాని జలజ వెళ్ళిపోయి చాలాసేపయిన సంగతి గురుతొచ్చి, తీవ్రమయిన ఆలోచనలోపడింది.

* * *

చూస్తే, జీతపురాళ్లు చేతులో పడలేదు. రాత్రిరికి ప్రయాణం పెట్టుకున్నదామె. ఎట్లారా భగవంతుడా అని పరిపరి విధాల యోజిస్తూంది జలజ—ఇంటిదగ్గిర.

ఇంతలో గుమ్మంలో కారు చప్పుడు ! స్వాప్నికావస్థనుంచి లేచి, ఆ వచ్చిందెవరో చూడబోయింది. చూస్తే, అమ్మగారే!

"ఆహా, తల్లికి యెంత దయ ! కోప్పడినప్పుడు కోప్పడినా ఆపదలో ఆదుకునే మాలక్ష్మి అమ్మగారు గాక మరెవరు. రైలుకెళ్లాలి గదా అనిచెప్పి, జీతం స్వయంగా చేతపట్టుకొచ్చారు గామోసు!..." అని ఈమోస్తరుగా లిప్తకాలంలో జలజకు ఎన్నో ఊటలూరేసినయి.

అమ్మగారి వెంట అయ్యగారు, ఆయన వెంట ఒక పోలీస్ సార్జెంటూ దిగారు. జలజ ఆశ్చర్యానికి మేర లేదు.

అమ్మగారు :— ఇదిగో, ఈ అమ్మాయే.

జలజ బిక్కజచ్చిపోయింది.

"ఏమిటండమ్మా !—" అని అడిగింది, ఏదో మీద పడబోతున్న విపత్తు యొక్క ఛాయల్ని చూస్తూ.

సార్జెంటు:—ఏయ్, అమ్మాయి!—మీ అయ్యవారింట్లో కాసులుపేరు కనబడ్డంలేదు. నువ్వే తీసుండాలని...

'నేనా!.. నేనా...నేను తీశానా!!—' అంటూ జలజ, ఆవేదనతో కూడిన కేక పెట్టింది, అమ్మగారి వేపు తిరిగి.

అనుమానంపై ఆమె అరెస్టు అయింది.

నిరపరాధినని ఎన్నివిధాల చెప్పుకున్నా అదంతా అరణ్యరోదనమే అయింది.

'పై వాళ్ళింకెవరొస్తారూ ...' అని అమ్మగారు.

అదీగాక, అక్కడ చోరీ పోవడం, ఇక్కడ జలజ ప్రయాణం పెట్టుకోవటం— ఇది అమ్మగారి అనుమానానికి మరీ బలీయమయింది.

---


# ఆకుకూరలు

అవిసె – ఉస్తి – కరివేప – కామంచి – కాబేజీ – కొత్తిమిరి– కోలపాల – గుంటగలగర – గోగు – చక్రవర్తి – చామ – చింత – చిట్రి– చిలుకకూర – చుక్క – తమలపాకు – తుమ్మి – తోటకూర – దొగ్గిలి – దోస – నీరుల్లి – పుదీనా – పొన్నగంటి – బచ్చలి – బలుసు – బొద్ది – మునగ – మెంతి – వేప – సరస్వతి– సీకాయ అనే ముప్ఫయి ఒక్కరకాల ఆకుకూరల వివరాలు గలవు. ఆకుకూరల ప్రాశస్త్యాన్ని వివరించే చక్కని పీఠికకూడా వున్నది.

ప్రతికోసం

## రెండు అణాలు

పోస్టుబిళ్ళలు పంపేది.

ఆంధ్రభూమి బుక్కుడిపో

వేపేరి : మదరాసు.

సరే, పడింది శిక్ష.

'ఆరుమాసాల కఠిననరకం...'

* * *

కొన్ని నెలలయినాక—

ఒకనాడు మావాడు డెయిలీ పేపరు చదువుతూ ఒక దగ్గిర కొచ్చే సరికి బిత్తరపోయాడు.

భార్యని పిలిచాడు.

'ఇది చూశావా!'

పత్రికలోని వార్త ఇట్లా చదివారు ఇద్దరున్నూ—

మద్రాసు : 7 మే.

'నేడు ఉదయం ఒక యువతిశవము కూవమ్‌నది పైన తేలినది. ఆమె ఇటీవల ఒక చోరీకేసులో ఆరునెలలు అరెస్టయిన 'జలజ' అనే అమ్మాయిగా పోల్చబడినది. ఆమె జైలునుండి విడుదలయినప్పటినించీ తిండికి లేక ఆత్మహత్య చేసుకున్నట్టు నిశ్చయింపబడినది.'

మావాడు.—అరెరే, ఎంత పని!

అమ్మగారు:— ఆఁ!— అంతా దాని ఖర్మ... (అని బుర్ర అడ్డంగా వూపింది.)

* * *

ఈ ప్రసంగం జరుగుతూవుండంగానే మావాళ్ల పదేళ్ళబ్బాయి కేరింతాలుకొడుతూ, తళతళ మెరుస్తూవుండే కాసులుపేరు చేతపట్టుకొచ్చాడు. చప్పట్లు కొట్టాడు. పకపక నవ్వాడు. 'దొరికిందోయ్, దొరికింది!' అని కూనరాగాలు తీస్తూ. గంతులేశాడు కూడాను.

'యెక్కడిదిరా నాయనా!...' అని ఆత్రంతో అడిగారు మా వాళ్ళు.

'నే నోనాడు ఆడుకుందికి తీసుకున్నానే అమ్మా. ఆ మర్నాడు ఇది అవుపించలేదే. కోప్పడతారని చెప్పి నేనెవళ్ళతోనూ చెప్పలేదే. తోటలో ఆడుకుంటుంటే ఇప్పుడు తుప్పలో మెరిసిందే అమ్మా...'

'ఓరి, నీ కడుపుడకా...' అంటూ పెద్ద నిట్టూర్పు విడిచింది అమ్మగారు.

నిరపరాధిని జలజను బలిగొన్న ఈ కాసులుపేరును చూచి, మావాడు జలజల దుఃఖబాష్పాలు రాల్చాడు.

చచ్చి స్వర్గాన వున్న అమాయికపు జలజకు ఈ తతంగమంతా యేం తెలుస్తుంది!

* * *

పొట్టకోసం తలమ్ముకున్న పరిచారిక. జలజ ఆమెకు డబ్బులేదు, పలుకుబడి లేదు. ఆమె మాటను సంఘం వినిపించుకోదు, ఆమె దారిద్ర్యానికి విరుగుడులేదు. దారిద్ర్య బాధను ఆమె యిష్టపడి సహించింది. కాని, యింటా ఒంటా లేని దొంగతనం అంటకట్టడంతో ఈ దుష్టప్రపంచం యింతే ననుకున్నది.

తన మాట చెల్లుబడి కావటానికి సావకాశం లేని ఈ లోకంలో తనకు తావులేదని నిశ్చయించింది.

శాస్త్రులకేం?—రెండు నాలికల శాస్త్రులు! సమయానుకూలంగా సంచరించే రాజకీయ వేత్తలవంటి ఈ శాస్త్రులు, ముక్కుకి సూటిగా పోదామనుకున్న జలజవంటి అమాయికలకు సాయపడవు.

ఈ అన్నిటికీ అతీతమైన రక్షణ ఒక్కటే—మృత్యుదేవత ఒడిలో తలదాచుకోవటం.

ఆ పనే చేసి జలజ ధన్యురాలయింది!

---


# కథల పుస్తకాలు

| | |
|---|---|
| కారుణ్యం | 0 4 0 |
| —కొడవటిగంటి కుటుంబరావు | |
| రూమ్ టు లెట్ | 0 4 0 |
| —పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి | |
| స్వాగతం | 0 4 0 |
| —కొడవటిగంటి కుటుంబరావు | |
| కలికి | 0 4 0 |
| —బొడ్డు బాపిరాజు | |
| బ్రాహ్మణీకం | 0 4 0 |
| —గుడిపాటి వెంకటచలం | |
| యువకథావళి | 0 4 0 |
| —వివిధ రచయితలు | |
| ఇల్లరికం | 0 4 0 |
| —కొడవటిగంటి కుటుంబరావు | |
| పాంచజన్యం | 0 6 0 |
| —చక్రపాణి | |
| బడదీదీ | 0 4 0 |
| —చక్రపాణి | |
| త్రిలోచన కవిరాజు | 0 6 0 |
| —చక్రపాణి | |

ఆంధ్రభూమి బుక్ డిపో

వేపేరి : మదరాసు.